గొర్రెల పంపిణీ అయ్యేనా?

- మూడేళ్లు గడిచినా పూర్తికాని పంపిణీ
- 1070 మంది లబ్ధిదారుల ఎదురుచూపులు
- రెండో విడతలో 20,165 యూనిట్లు


గొర్రెల మందకు కాపుకాస్తున్న లబ్ధిదారుడు(ఫైల్)

మానవపాడు: గొర్రెల పంపిణీలో నీలినీడలు కమ్ముకున్నాయి. గొర్రెల కోసం లబ్ధిదారులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మొదటి విడత పంపిణీ పూర్తి అయినా రెండో విడత గొర్రెల పంపిణీకి ఎదురుచూపులు తప్పడం లేదు. గొర్రెలు వస్తాయో.. రావో అనే ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. కులవృత్తులను ప్రోత్సహించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం మారి కొత్తగా మరో ప్రభుత్వం ఏర్పడిన అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన.. గొర్రెల పంపిణీ పథకంలో నీలినీడలు అలుముకున్నాయి. ఈ పథకం అమల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గొర్రెలు వస్తాయి.. వాటిని పెంచి పునరుత్పత్తి చేసి ఉపాధి పొందుతామని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. గొర్రెల అభివృద్ధి పథకంలో భాగంగా రెండో విడతలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ ఇంకా పూర్తికాలేదు. గొర్రెల కోసం లబ్ధిదారులు డీడీలు తీసి రెండేళ్లు గడిచింది. మొదటి విడతలో పంపిణీ సాఫీగా సాగినా, రెండో విడతలో మాత్రం పంపిణీ నత్తనడకన సాగుతోంది. గొర్రెల కోసం డీడీ కట్టిన వారు 1070 మంది ఉన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంలోనైనా గొర్రెల పంపిణీ జరిగేనా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వారిలో దాదాపు 20,165 యూనిట్లు ఉన్నాయి. ప్రతి లబ్ధిదారుడు నష్టపోకుండా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

75 శాతం రాయితీపై..

రాష్ట్రంలో మాంసం ఉత్పత్తిని పెంచడంతోపాటు గొల్ల, కురుమలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ ఆలస్యం జరిగింది. గత ప్రభుత్వం నిబంధనల ప్రకారం.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం 75 శాతం రాయితీపై గొర్రెలను, ఒక్కో యూనిట్‌పై 20 గొర్రెలు, ఒక విత్తన పొట్టేలు అందించింది. స్థానికంగా లభించే జీవాలు కాకుండా ఇతర రాష్ట్రాల గొర్రెలను కొనుగోలు చేయాలని నిర్ణయించి, ఒక యూనిట్ విలువ రూ.1.25 లక్షలు కాగా, అందులో ప్రభుత్వం యూనిట్‌కు 75 శాతం (రూ.93,750) రాయితీ ఏర్పాటు చేసింది. మిగితా 25 శాతం (రూ.31, 250) లబ్ధిదారులు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలు పెట్టి గత ప్రభుత్వం డబ్బులు కట్టించుకుంది. కానీ ఇంతవరకు గొర్రెలను పంపిణీ చేయలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ చేస్తుందని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

మండలం	మొదటి విడత పంపిణీ	రెండో విడత పంపిణీ	ఇంకా పంపిణీ చేయాల్సినవి
మానవపాడు	892	54	1850
ఉండవెల్లి	304	274	1274
ఇటిక్యాల	1622	112	1523
వడ్డేపల్లి	1233	94	3435
అయిజ	953	165	7324
అలంపూర్	774	207	2555
రాజోళి	221	108	2204

డీడీ డబ్బు చెల్లించాలి..



డబ్బు చెల్లించి రెండున్నరేళ్లు గడుస్తోంది. మా డబ్బులు తిరిగి ఇప్పించాలని అధికారులను కోరాం. యూనిట్లు అందజేస్తామని చెబుతూ వస్తున్నారు. వెంటనే నాణ్యమైన గొర్రెలను పంపిణీ చేయాలి. తీవ్ర జాప్యం జరుగుతోంది. గ్రామస్థాయిలో గొర్రెలు రానివారు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నరసింహులు మానవపాడు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి..



గత ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించింది. కరోనా ప్రభావం వల్ల ఆలస్యం జరిగింది. త్వరలోనే గొల్ల, కురుమలకు తప్పకుండా గొర్రెల పంపిణీ జరుగుతుందని ఆశించాం. కొత్త ప్రభుత్వం ఏర్పడటం వల్ల విధివిధానాలు ఎలా ఉంటాయో తెలియదు. లబ్ధిదారులు నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా కుర్వ యాదవ సంఘం అధ్యక్షుడు

కొత్త ప్రభుత్వం ఆదేశాలతో అమలుచేస్తాం..

తెలంగాణలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటాం. ఇప్పటి వరకు జిల్లాలో 1070 మంది లబ్ధిదారులు డీడీల రూపంలో చెల్లించారు. ప్రభుత్వం ఆదేశానుసారం నడుచుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్యాధికారి

కాంగ్రెస్ పాలనలో దళితులకు పెద్దపీట


కేక్‌కట్ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గద్వాల అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తోందని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీచైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంజిపేట శంకర్, మధుసూదన్‌బాబు, ఇసాక్, ఎల్లప్ప, శ్రీనివాస్‌గౌడ్, జమాల్ ఉన్నారు.

మంత్రులను కలిసిన ఏఐసీసీ కార్యదర్శి


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సంపత్‌కుమార్

అలంపూర్: రాష్ట్ర రాజధానిలోని ప్రభుత్వ సచివాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ గురువారం కలిసి అభినందించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పంచాయతీ రాజ్ గ్రామీణ శాఖ మంత్రి సీతక్కను ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ సచివాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసినట్లు తెలిపారు.

కేజీబీవీ పరిశీలన



మానవపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని, తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



అయిజ: మండలంలోని కొత్తపల్లిలో గురువారం వరాహ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల ప్రజలు ఉత్సవాలకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

సస్యరక్షణతోనే అధిక దిగుబడి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో



వరిసాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓలు

ఎర్రవల్లిచౌరస్తా: పంటల సాగులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని చాగాపురం ఏఈవో భరత్ అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను రైతులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలు ప్రస్తుతం శాఖీయ దశలో ఉన్నాయన్నారు. అక్కడక్కడ పంటలో కత్తెర పురుగు ఉధృతిని గమనించి ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. పంటలో కత్తెర పురుగు నివారణకు స్పైనటోరం అనే రసాయనిక మందును 1మి.లీ. లీటర్ నీటికి కలిపి పంట బాగా తడిచేలా పిచికారి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన

మల్దకల్: వరి పంట సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ సూచించారు. గురువారం మల్దకల్ గ్రామంలో వరి సాగుపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి సాగు చేసిన రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా వరి పంటను సాగు చేసి, అధిక లాభాలను పొందాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, జీవన ఎరువుల వాడకం పెంచాలన్నారు. జీవన ఎరువుల వినియోగంపై కలిగే ఉపయోగాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఖాజా, కిషోర్‌కుమార్, రాహుల్, హారిక, మేఘన, సుజాత, పల్లవి, భాస్కర్, జోహాన పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

గద్వాల అర్బన్: ప్రజలు పబ్లిక్ టాయిలెట్స్‌ను వినియోగించుకోవాలని మున్సిపల్ పర్యావరణ ఇంజినీరు ప్రహణి అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 25వ తేదీ వరకు క్లీన్ టాయిలెట్స్ అనే అంశంపై క్యాంపియన్‌లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పబ్లిక్ టాయిలెట్స్ వద్ద చేరుకోని పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. స్వచ్ఛభారత్‌కు సంబంధించిన అంశాలను ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ వెంకటేశ్వర్లు, టీఎంసీ శ్రీకర్, సీఓ మహలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి



కేటీదొడ్డి: రైతులు నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ ప్రీతిసుధ అన్నారు. మండల కేంద్రంలోని మండల వ్యవసాయాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 2023లో యాసంగి సీజన్‌కు అందించే రైతుబంధు కోసం నూతనంగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతు వేదికలలో ఏఈఓలకు కలిసి దరఖాస్తు పత్రాలు అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు పంటపొలం పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ పేపర్లు అందజేయాలని సూచించారు.

గట్టు: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలను పొందిన రైతులు యాసంగి రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ భక్తవత్సల రైతులకు విజ్ఞప్తి చేశారు. బోయలగూడెంలోని రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బోయలగూడెంలో 44 మంది రైతులకు కొత్తపట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు ఉన్నట్లు తెలిపారు. జాబితాలను రైతువేదిక సూచిక బోర్డుపై ఏర్పాటు చేసినట్లు ఏఈఓ తెలిపారు.

కొత్త ఓటర్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోండి

శాంతినగర్: జనవరి 1 వరకు 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరు ఓటర్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ కార్డు ఉండి తప్పులుంటే సరిచేసుకోవడానికి మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, కానీ అందుకు తగ్గట్టుగా అలంపూర్ మండల కేంద్రానికి రాకపోకలకు గ్రామాలకు బస్సులు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో ఉన్నట్లు ప్రతి అరగంటకు ఒక బస్సు ఉండేవి ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కూటీలోకి పాము

గద్వాల క్రైం: గద్వాల కోర్టు సముదాయంలో గురువారం పార్కింగ్ చేసిన స్కూటీ వాహనంలోకి పాము దొరబడింది. గమనించిన స్కూటీ యజమాని మహేష్ పాములు పట్టే వ్యక్తిని పిలిపించి బయటకు తీశారు.

మిర్చికి తెగుళ్లు రైతుల ఆందోళన



ఉండవెల్లి: మండలంలోని మిర్చి పంటలు దాదాపు తెగుళ్లతో ఆకులు రాలిపోతున్నాయి. వర్షాలు లేక పంటలు పండక రైతులు మిర్చి పంటను సాగుచేసిన సమయానికి ఆర్డీఎస్ నీటిని కట్టిన సమయంలో తెగులు సోకి పంటలు దెబ్బతింటున్నాయి. మిర్చి పంటలకు సరైన దిగుబడి రాకా రైతులు నష్టాలపాలవుతున్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన



అలంపూర్ రూరల్: ఈ నెల 18న గద్వాల జిల్లా ఆస్పత్రిలో పిల్లలు కాకుండా మగవారికి (వెసెక్టమీ) కుటుంబ నియంత్రణ కోసం క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి తెలిపారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో గురువారం ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎమ్‌ల సమీక్ష నిర్వహించారు.

అయ్యప్ప పడిపూజ



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని న్యూప్లాట్స్ కాలనీలో గల కన్నెస్వామి విజయ్ ఇంట్లో అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, రఘు స్వామి ఆధ్వర్యంలో మాల ధరించిన అయ్యప్ప స్వాములు భజనలు నిర్వహించారు. మాలధరించిన అయ్యప్ప స్వాములు శ్యామ్, కృష్ణ, రాము, విశ్వాస్,గణనాథ, విశ్వాస్ నవీన్, రంగ పాల్గొన్నారు

ఎమ్మెల్సీ చల్లాకు సన్మానం


ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

అలంపూర్: కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు గురువారం కలిశారు. అలంపూర్ మున్సిపాలిటీకి చెందిన దివాకర్, సంతోష్ నగర్ బీఆర్‌ఎస్ నాయకులు శ్రీను, సుధాకర్ మద్దిలేటి, జీవన్, స్వాములు, కుర్మన్న, రాజు, ప్రసన్న, ఆయా మండలాల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, షేక్‌వలీలు ఎమ్మెల్సీని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కోనేరు గ్రామ నాయకులు ఎమ్మెల్సీని గజమాలతో సత్కరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిప్రకాష్

అయిజ: గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిబంధనల మేరకు పనిచేయాలని, కొంతమంది నిబంధనలు పాటించడంలేదని వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ సాయిప్రకాష్ హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ నరసింహారెడ్డితో కలిసి ఎంపీడీఓ సాయిప్రకాష్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంపీఓలు మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్యను పెంచాలన్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు నర్సరీలను సిద్ధం చేయాలని, ఇంటి పన్ను వసూలు చేయాలని గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలు కనిపించకుండా చేసి గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. రికార్డులన్నింటిని అప్‌డేట్ చేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మేస్త్రీలకు బీమా పత్రాల అందజేత


బీమా పత్రాలను అందిస్తున్న ఇంజినీరు సునీల్

గద్వాలన్యూటౌన్: నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంట్ పెట్టింది పేరు అని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సునీల్ అన్నారు. గురువారం గద్వాల పట్టణంలోని శ్రీరంగస్వామి ట్రేడర్స్ ఆధ్వర్యంలో మేస్త్రీలతో సమావేశం నిర్వహించి వారికి లక్ష రూపాయల బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన భారతిసిమెంట్ సాంకేతిక ప్రమాణాలను వివరించారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోల్చితే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతంగా పూర్తి అవుతుందన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి వినియోగదారులకు సహాయపడతారన్నారు. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. యాదాద్రి, ఆలేరు–వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి భారతి సిమెంట్ వాడటం చాలా గర్వకారణమన్నారు. అనంతరం 60 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ విజయ్‌బాబు, డీలర్ రంగస్వామి, శ్రీనివాసులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

రాయచూర్ రోడ్డుపై ప్రమాదకర కల్వర్టులు


జాంపల్లి సమీపంలో ప్రమాదకరంగా కల్వర్టు

ధరూరు: అంతర్రాష్ట్ర రహదారి గద్వాల – రాయచూర్ మార్గంలో రోడ్డుపై ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. ధరూరు నుంచి జాంపల్లి వెళ్లే దారిలో ఈదమ్మ మిట్ట (ఎర్రమట్టి గుంతల) వద్ద ఉన్న కల్వర్టు కూలిపోయి ఏళ్లు గడిచినా పట్టించుకునే వారు కరువయ్యారు. అక్కడే ముళ్ల పొదలు పెరగడంతో కల్వర్టు సైతం కనిపించడం లేదు. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా గోతిలో పడడం ఖాయంగా కనిపిస్తోంది. జాంపల్లి– కోతుల గిద్ద స్టేజీల మధ్య ఉన్న కల్వర్టులు సైతం ఇటీవల ఓ మట్టి టిప్పర్ తగిలి కూలిపోయింది. దీంతో ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు వాటిపై దృష్టి పెట్టి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంతలమయంగా గట్టు రోడ్డు


బీటీ రోడ్డు గుంతలపై పోసిన దస్తు

ధరూరు: మండలకేంద్రం నుంచి గట్టు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. ధరూరు నుంచి మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాలకు వెళ్లే వారు ఈ మార్గం గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దాదాపు 7కి.మీ. మేర రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిధుల లేవంటూ కాలయాపన చేస్తున్నారు. ధరూరు నుంచి మార్లబీడు సమీపంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ వరకు రోడ్డు మరమ్మతు చేయాలని రెండు మండలాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయండి


బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న చిన్న దేవన్న

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్–పాత బస్టాండ్ మధ్యన పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న కాంట్రాక్టర్‌ను కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం సిబ్బందితో కలిసి బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు అధికారులతో తమ సమస్యలను వినిపించారు. బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయని వాపోయారు. బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టినప్పటినుంచి ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయని వాపోయారు. ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

- చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న టీచర్లు
- ఆరోగ్యవంతులుగా గర్భిణులు, బాలింతలు


మెన్నిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు


గర్భిణీలకు అవగాహన కల్పిస్తున్న మండల సూపర్‌వైజర్

ఉండవెల్లి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు, పౌష్టికాహార లోపం నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అందులో భాగంగా సిబ్బంది కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు రుచికరమైన భోజనం అందిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, నాణ్యమైన ఆహారం అందిస్తుండడంతో కేంద్రాలకు వచ్చేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరుస్తున్నారు.

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం

మండలంలోని 15 గ్రామాల్లో ఉన్న వాటి పరిధిలో 34 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో వసతులు సరిగా లేక చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 34 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో గర్భిణులు 241, బాలింతలు 203, 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 956, 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల చిన్నారులు 765 మంది ఉన్నారు. కేవలం 8 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 26 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, కొన్ని పాఠశాలలో విలీనం అయ్యాయి. అయితే అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి ప్రభుత్వం ఇచ్చే అద్దె డబ్బు ఏ మాత్రం సరిపోవడం లేదు. నెలకు రూ.1000 కంటే తక్కువగా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే రూ.500 కు మిగితా మొత్తాన్ని అంగన్‌వాడీ టీచర్లు కలిపి భవన యజమానులకు చెల్లిస్తున్నారు.

లబ్ధిదారులకు అందుతున్న ఆహారం..

మండలంలోని కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు ఆరోగ్యలక్ష్మీ పథకం కింద ఒక పూట భోజనం, కోడిగుడ్డు, పాలు అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు నెలకు 16 కొడిగుడ్లు, బాలామృతం ప్యాకెట్; మూడు నుంచి ఐదేళ్ల చిన్నారులకు రోజుకో కొడిగుడ్డు, గర్భిణులు, బాలింతలకు, రోజుకు రూ.200 మి.లీ. పాలు అందిస్తున్నారు. కిచెన్‌గార్డెన్లతో తాజా కూరగాయలతో ఆహారం ఇస్తున్నారు.

అవగాహన సదస్సులు..

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తీసుకోవాల్సిన ఆహారం, సుఖప్రసవం కోసం అవగాహన కల్పించడం, ప్రసవం అయ్యాక తల్లిపాల ప్రాధాన్యతను కేంద్రాల్లో వివరిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరిక్షలతోపాటు చిన్నారులకు ఇచ్చే వ్యాక్సిన్లు ఉచితంగా అందిస్తున్నారు. మూడేళ్లు దాటిన వారికి పాఠాలు సైతం బోధిస్తున్నారు.

వచ్చేవారు పెరుగుతున్నారు..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతుంది. ఆటపరికరాలతో విద్యాబుద్ధులు నేర్పిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

– ఆస్మా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్